# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త








### అభివృద్ధి పనులకు

## మంత్రి రోజా భూమిపూజ

పుత్తూరు, డిసెంబరు 18 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీలోని 16వ వార్డు పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 8.50 లక్షలతో చేపట్టే మూడు అభివృద్ధి పనులకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా సోమవారం భూమి పూజ చేశారు. ఈ నిధులతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద, జ్ఞాన జ్యోతి హైస్కూలు, ఎన్జీవో కాలనీలో శుభం ఫంక్షన్ సమీపంలో మూడు సిమెంట్ రోడ్లను నిర్మిస్తారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుత్తూరు మునిసిపాలిటీలో రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్ ఛైర్మన్లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ వి.ఎం.మాహీన్, కౌన్సిలర్లు ఏకాంబరం, వనిత, భానుమతి, నాయకులు కె.టి.ప్రసాద్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, గూలూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

### తిరుమలలో గవర్నర్ జస్టీస్ నజీర్



తిరుమల, డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రగవర్నర్ జస్టీస్ అబ్దుల్‌నజీర్ సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. ఇక్కడి రచన విశ్రాంతి గృహం వద్ద టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి పుష్పగుచ్చాలతో సాదర స్వాగతం పలికారు.

### 28నుంచి కుప్పంలో చంద్రబాబు పర్యటన

కుప్పం, డిసెంబర్ 18 ప్రభాతవార్త



తెదేపా అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఈనెల 28-30తేదీల్లో మూడురోజుల పాటు పర్యటించనున్నారు. ఈ మేరకు చంద్రబాబు పర్యటన ఖరారైనట్లు దేశం వర్గాలు తెలిపాయి. మూడు రోజుల పర్యటనలో భాగంగా అధినేత చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం గ్రామీణ మండలాలతో పాటు కుప్పం మున్సిపాలిటీలో సైతం పర్యటించనున్నారని తెలిసింది. గ్రామాల్లో రోడ్‌షోలు నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగి ంచబోతున్నారు. ఈ ఏడాది జూన్ నెలలో సైతం చంద్రబాబు కుప్పంలో మూడు రోజులు పర్యటించి పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. ఈసారి పర్యటనలో భాగంగా అటు ప్రజలు, ఇటు పార్టీ శ్రేణులను కలవాలని నిర్ణయించుకున్నారు. చంద్రబాబు పర్యటన పూర్తి వివరాలు అధికారికంగా రావాల్సి ఉంది.

### పురవీధుల్లో గౌరమ్మ దర్శనం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 18 ప్రభాతవార్త

దక్షి కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ధనుర్మాసం నెల రోజుల పాటు గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి. సోమవారం ధనుర్మాసం సందర్భంగా అమ్మవారు గొబ్బెమ్మగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.అలంకార మండపంలో దేవేరిని కన్నుల పండువగా అలంకరించి బోయిలు మోసుకుంటూ శివయ్య మండపం నుంచి రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ నుంచి వాహనంపై అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. గొబ్బెమ్మ పట్టణంలో గ్రామోత్సవం రావటంతో ఇంటింటా నాలుగుమాడావీధుల్లో అమ్మవారికి హారతులందించి మొక్కులు తీర్చుకున్నారు. అలంంకార మండపంలో అమ్మవారిని అలంకార గురుకుల్స్ రాజేష్, సూరిలు ముస్తాబు చేయగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఆలయ ఇఓ కె.యస్ రామారావులు హారతులిచ్చి ఉత్సవానికి సమాయత్తం చేసారు.ఆలయ ఆవరణలో వారిద్దరు అమ్మవారి అంబారిని మోసారు. ఉత్సవంతోపాటు ఆలయానికి చెందిన ఇన్సెపెక్టర్లు హాజరయ్యారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే...

# వికసిత్ భారత్ లక్ష్యం

### - రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



తిరుపతిరూరల్, డిసెంబర్18 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే వికసిత్ భారత్ లక్ష్యమని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. 2047 నాటికి భారత్ ఒక మహా శక్తివంతమైన దేశంగా నిలవనున్నదన్నారు. సోమవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో పారిశుధ్య సౌకర్యాలు, అవసరమైన ఆర్థిక సేవలు, ఎల్‌పిజి కనెక్సన్స్, పేదలకు గృహాలు, ఆహార భద్రత వంటి ప్రాథమిక సౌకర్యాలు అందించటానికి ప్రధాన పథకాలు ద్వారా సంతృప్త మిషన్ చురుగ్గా నిమగ్నమైనట్లు తెలిపారు. సరైన పోషక ఆహారం, నమ్మకమైన ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛమైన త్రాగునీరు, నాణ్యమైన విద్య తదితర మౌళిక సేవలను లబ్దిదారులకు అందుబాటులో ఉంచడమే లక్ష్యం అన్నారు. లాస్ట్‌మైల్ డెలవరీని సులభతరం చేయడానికి పౌరులకు లభించే ప్రయోజనాలు, వివిధ సౌకర్యాల గురించి అవగాహన కల్పించడంలో ఇందులో మరోక దశగా పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులందరికి అందేలా అవగాహన కల్పించడంతో పాటు కోట్లాది మంది పౌరుల నిర్లక్ష్య భావనను దూరం చేయడం ఈ యాత్ర లక్ష్యమని, 2047 నాటికి స్వాలంబన, అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క లక్ష్యాన్ని సాధించడమే అన్నారు. భారత ప్రభుత్వ పథకాల సంతృప్తతను సాధించడం, దుర్భల జనాభాను చేరుకోవడంపై దృష్టి సారించడం యాత్ర లక్ష్యమన్నారు. వివిధ సంక్షేమ పథకాల కింద అర్హులై ఉండి, ఇప్పటివరకు ప్రయోజనాలను పొందని బలహీన వర్గాలను చేరుకోవడానికి సమాచార వ్యాప్తి, పథకాల గురించి అవగాహన కల్పించడం, వారి వ్యక్తిగత కథనాలు, అనుభవ భాగస్వామ్యం ద్వారా లబ్దిదారులతో పరస్పర ముఖాముఖీ నిర్వహించడం ద్వారా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ యోజన పథకం కింద కుటుంబానికి రూ.5లక్షల ఉచిత భీమా, ప్రధాన మంత్రి అవాస్ యోజన-పేదలకు గృహ నిర్మాణ పథకం, జల్ జీవన్ మిషన్-ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించడం, పిఎం కిసాన్ సమ్మాన్-రైతులకు స్వల్పకాలిక రుణ సదుపాయాలను అందించడం. పిఎం ఉజ్వల యోజన-పేద కుటుంబాల నుండి మహిళలకు ఉచిత ఎల్‌పిజి కనెక్షన్ అందించడం. పిఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన-లబ్దిదారులకు నెలకు 5కిలోల ఉచిత ఆహార ధాన్యాలు అందించడం. పిఎం భారతీయ జన్ ఔషధి పరియోజన-చాలా తక్కువ ధరకు జనరిక్ ఔషధాలు అందించడం. పిఎం. స్వామిత-గ్రామాల సర్వే, గ్రామా ప్రాంతాల్లో మెరుగైన సాంకేతికతతో మ్యాపింగ్ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేద ప్రజలకు అందించటానికి కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటక రమణారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా తిరుపతి జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయబడుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్దేశాల మేరకు పిఎం కిసాన్ యోజన, ఫసల్ భీమా యోజన, ఆయుష్మాన్ భారత్, పిఎం పోషణ అభియాన్, పిఎం అవాస్ యోజన గ్రామీణ, పట్టణ ప్రజలకు గృహ వసతి, పిఎం పెన్సన్స్, అటల్ పెన్సన్ వంటి బృహత్తర కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

# ఆ పదిరోజుల దర్శనం ఒకే ఫలితం

### -వైకుంఠద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు
### -22న మధ్యాహ్నం నుండి తిరుపతిలో టోకెన్లు :టిటిడి ఈఓ ధర్మారెడ్డి



తిరుమల, డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి: ధనుర్మాసంలో పవిత్రమైన పదిరోజుల వైకుంఠద్వార దర్శనం ఏ రోజుచేసుకున్నా ఒకే ఫలితం లభిస్తుందని టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి వెల్లడించారు. 23వతేదీ నుండి జనవరి 1వతేదీ వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు తిరుమలలో భక్తులకు విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు చెప్పారు. వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో 22వతేదీ మధ్యాహ్నం 2గంటల నుండి టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తామన్నారు. తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి జెఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఈ నాగేశ్వరరావు, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, గోవిందరాజదీక్షితులు, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖకుమార్, సిఏఓ శేషశైలేంద్ర, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, టిటిడి పిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఈఓ ఏవి ధర్మారెడ్డి అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుమల ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వారాలను 23వతేదీ తెల్లవారుజామున 1.45గంటలకు తెరచి ,జనవరి 1వతేదీ అర్ధరాత్రి 12గంటలకు ఈ వైకుంఠద్వారాలను మూసివేస్తామన్నారు. 22వతేదీ మధ్యాహ్నం 2గంటల నుండి టోకెన్లను తిరుపతిలోని 9 కేంద్రాల్లో 90 కౌంటర్లద్వారా టోకెన్లు పూర్తయ్యేవరకు 4,23,500 సర్వదర్శనం టోకెన్లు మంజూరుచేస్తామన్నారు. తిరుపతిలో శ్రీనివాసం, విష్ణు నివాసం, గోవిందరాజస్వామిసత్రాలు, భూదేవికాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరామైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలో రామానాయుడు ఉన్నతపాఠశాల, ఎంఆర్‌పల్లిలోని ఉన్నతపాఠశాలలో ఉచిత సర్వదర్శన టోకెన్లు పొందవచ్చన్నారు. దర్శన టోకెన్లు పొందిన భక్తులు తమ టోకెన్లపై సూచ్చిఇన తేదీ, సమయానికి శ్రీవారి దర్శనానికి రావాలని విజ్ఞప్తి చేశారు. భక్తులు తిరుపతిలోనూ బసచేయాలని ఈఓ ధర్మారెడ్డి కోరారు. ఈ సమావేశంలో ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖకుమార్, ఎస్టేట్ అధికారి మల్లికార్జున, డిప్యూటీ ఈఓలు శెల్వం, భాస్కర్, రాజేంద్ర, విఎస్ఓలు గిరిధర్, నందకిశోర్, ఐటి జిఎం సందీప్‌రెడ్డి, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఏపిఆర్ఓ నీలిమ పాల్గొన్నారు.

### ఆరోగ్యశ్రీ పరిమితి

# రూ.25 లక్షలకు పెంపు

**రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద ఏడాదికి రూ.4,100 ఖర్చు**

**జిల్లాలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలకు రూ.635 కోట్లు, ఆరోగ్య ఆసరా రూ.62 కోట్లు ఖర్చు : మంత్రి పెద్దిరెడ్డి**



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు డిసెంబర్ 18 ప్రభాతవార్త: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ శ్రీ పథకం కింద నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలందిస్తున్న ఈపథకం పరిమితిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 25 లక్షల రూపాయలకు పెంచారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వెలగపూడి సీఎం క్యాంపు కారా ఆయయం నుండి సీఎం జగన్ మెగా ఆరోగ్యశ్రీ ఆవగాహన కార్యక్రమంను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈకార్యక్రమంకు కలెక్టరేట్ నుండి మంత్రితో పాటు జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఆముద, రాష్ట్ర ఈడిగా కార్పొరేషన్ జెజె.శాంతి తదితరులు పాల్గొన్నారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మంత్రి పెద్దిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జబ్బులతో బాధపడుతున్న నిరుపేద, మధ్యతరగతి వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద మన రాష్ట్రం, పొరుగు రాష్ట్రాలలో కార్పొరేట్ ఆస్పత్రుల్లో 3,200 జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. ఈపథకం కింద ఇప్పటి వరకు వున్న వైద్యఖర్చుల పరిమితిని ప్రస్తుతం సీఎం జగన్ 25 లక్షల రూపాయలకు పెంచారన్నారు. క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాదులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆసరా కింద దాదాపు రూ.4,100 కోట్లు రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య విషయంలో సీఎం జగన్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని, దీనికి అనుగుణంగా నాడు-నేడు కార్యక్రమంతో అస్పత్రుల ఆధునీకరణ, వైద్య సిబ్బంది పారామామెడికల్ సిబ్బంది సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించడం, ప్రతి జిల్లాకు వైద్య కళాశాలను ఏర్పాటు, అందులో రీసెర్చ్ సెంటర్లును ఏర్పాటు చేసుకోవడంజరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాకాధికారి డాక్టర్ ప్రభావతి దేవి, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆరగో శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, జిల్లా పంచాయతీ అధికారి టి.లక్ష్మి, డీఐఓ డాక్టర్ రవిరాజు, జిల్లా ఆస్పత్రి సూపరెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, కార్పొరేటర్ హరిణిరెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

# గూడూరు ప్లైఓవర్ పనులు తొందరగా పూర్తి చేయండి

### ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్ ప్రద్యుమ్నకి ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ వినతి



గూడూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త గూడూరు ప్లె ఓవర్ పనులు తొందరగా పూర్తి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కేంద్రం నుండి సహాయం తీసుకోమని విజయవాడ అమరావతి సెక్రటేరియట్ నందు ఆర్‌అండ్‌బి ఛీఫ్ ఇంజనీర్ ప్రద్యుమ్నకు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు వినతిపత్రం అందజేసారు. అనంతరం మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో గూడూరు నియోజకవర్గంలో రోడ్డు దెబ్బతిన్నాయి. వాటిని సంబంధించిన 89 కోట్ల రూపాయిలు కోరుతూ ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఆ రోడ్లను తొందరగా మంజూరు చేయమని కోరారు. ఎక్కడెక్కడ అయితే బ్రిడ్జిలు పడిపోయాయో తిప్పగుంట పాలెం, ఉను గుంటపాలెం, రామాపురం, బాలిరెడ్డిపాలెం దానితో పాటు చిట్టమూరు మండలం గొల్లలనట్టు నుండి కార్కేడు వరకు, వయా బురదగాలి, కొత్తపాలెం వారికి శాంక్షన్ చేయమని వారిని కోరారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ నయీమ్ ముల్లని కలిసి ఈ విధంగా వర్షాల ప్రభావంతో రోడ్లన్ని తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాత్కాలికంగా గూడూరులో అన్ని కూడా పాడైపోయాయి. వాటిని తొందరగా మాకు చేసి ఇవ్వాల్సిందిగా వారితో ఎమ్మెల్యే చెప్పారు. ప్రత్యుమ్న తప్పనిసరిగా ఎంత త్వరగా గ్రాంట్ రిలీజ్ చేస్తామో అంత తొందరగా రిలీజ్ చేస్తానని చెప్పారు. ముఖ్యంగా బాలిరెడ్డిపాలెం, గోవింద పల్లిపాలెం, ఊనుకుంట పాలెం అలాగే కేశవరంలో ఉన్న రోడ్డు దానితో పాటు చిట్టమూరు మండలంలో ఉన్న గొల్లలనాటు నుండి కార్కేడు వరకు దానితో పాటు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బి రోడ్లను ఇవ్వాలని చెప్పారు.

# గతుకులరోడ్లు : వాహనచోదకులకు సంకటం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్‌పరిధిలో ఆర్‌అండ్‌బి రోడ్ల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఏళ్ల తరబడి ఈ శాఖ గతుకులకు కనీసం తట్టెడుమట్టి పోసే పరిస్థితి లేదు. ఇక మున్సిపల్ పరిధిలోని ఎస్‌డికె నగర్‌లోని రోడ్లపై ఎటు వెళ్ళలో ప్రశ్నార్థకంగా మారింది. బురదమయంగా మారాయి. అంతేకాక ఈ కాలనీల్లో వర్షపు నీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. ఇటీవల మిచాన్ తుఫాను పుణ్యమా? అని మంచినీటి సమస్య తీరింది. అయితే ప్రధాన ఆర్‌అండ్‌బి రోడ్ల పరిస్థితి దయనీయంగామారింది. పాతవరదయ్యపాళెం రోడ్డు, జయరామారావువీధి, బజారువీధి, నెహ్రూవీధి, పానగల్, తేరువీధి ప్రాంతాలోని ఆర్‌అండ్‌బి రోడ్లు అధ్వాన్నంగా మారాయి. జాతర సందర్భంగా కూడా ఆర్‌అండ్‌బిశాఖ కనీసం గతుకులకు కనీసం తట్టెడు మట్టి పోయలేదంటే ఆ శాఖ పని తీరుకు అద్దం పడుతుంది. ఏడు గంగమ్మలు పయనించు మార్గం అయిన బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల్లో రోడ్డు మధ్యలో గతుకులకు జాతర కమిటి నిర్వాహకులు మట్టి పోసి కార్యక్రమాలు జరిపారు. ఇక జయరామారావు వీదిలోని కూడలి మలుపు వద్ద రోడాం నిర్మించారు. దానికి సమీపంలోనే రోడ్డుకు అడ్డంగా ఓ కటింగ్ ఏర్పాటు చేసారు. ఇది గోతిలా మారింది. అలాగే బజారువీధిలోని బేరివారి సత్రం ఎదురుగా రోడ్డు, బేరివారి మండపం వద్ద రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా మారింది. కానీ ఆర్‌అండ్‌బి శాఖ పట్టించుకోదు. గోతిలా మారింది. దీంతో ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. కానీ ఈ మార్గంగానే ఎంఎల్‌ఏ స్టిక్కర్లు కార్లు తిరుగుతుంటాయి. మరి వారి వాహనాలకు కూడా అంతరాయం కల్గుతున్నా పట్టించుకోవటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. ఇక్కడ ఆటోలు, ద్విచక్రవాహనాలు గోతిలో పడినట్లు పడుతున్నాయి. అయినా పట్టించుకునే నాధుడు లేదు. ఈ మార్గంగుండానే మున్సిపల్ అధికారులు వాహనాలు పయనిస్తాయి. కానీ ఈ రోడ్డు మాకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారు. ఇక ఆర్‌అండ్‌బికి సంబంధించిన ఏరియా ఆసుపత్రి రోడ్డు దయనీయంగా మారింది. అక్కడ ఆర్‌అండ్‌బి కార్యాలయం, అతిధిగృహాలున్నాయి. కానీ రోడ్డును బాగుచేసుకోవాలనే శ్రద్ధ లేకపోవటం గమనించదగ్గ విషయం. ఇక ఏరియా ఆస్పత్రికి వెళ్ళేరోడ్డు గతుకులమయం అయ్యింది. ఇప్పటి కైనా ఆర్ అండ్‌బిశాఖ నిద్రావస్థ నుంచి మేల్కొని కనీసం గతుకులకు అతుకులు అయినా వేయాలని కోరుతున్నారు.



ఏరియా ఆస్పత్రికి వెళ్ళే రోడ్డు అస్తవ్యస్తంగా మారిన దృశ్యం

# సబ్‌వే మూసేసిన రైల్వే అధికారులు

### - గ్రామాలకు రాకపోకలు బంద్

దొరవారిసత్రం, డిసెంబర్ 18 ప్రభాతవార్త

ప్రభుత్వం రైల్వే ప్రమాదాలను అరికట్టడానికి ఉన్న రైల్వేగేట్లను తొలగించి సబ్‌వే అండర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సబ్‌వే అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారే గాని అక్కడ ఆ బ్రిడ్జిలోకి వచ్చే వర్షపు నీటిని తొలగించడానికి ఎలాంటి ఏర్పాటు చేయలేదు. దాంతో ఆ బ్రిడ్జిలోకి నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అటు ఆ రైల్వేట్రాక్ దాటుకొని వెళ్లే గ్రామాలకు రాకపోకలు లేకపోవడంతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ అధికారులు గాని, స్థానిక ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దొరవారిసత్రం మండలం అక్కరపాక, పోలిరెడ్డిపాలెం, నేతాజీనగర్, డివిసత్రం, మినమనముడి గ్రామాలకు సమీపంలో ఉన్న రైల్వేగేట్లను తొలగించి సబ్‌వే అండర్‌బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు. అయితే ఈ అండర్‌బ్రిడ్జిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో అక్కడ ఏర్పాటు చేసిన మోటార్లు మరమ్మతులకు గురై ఆ నీటిని తొలగించడానికి వీలులేకుండా పోయింది. దీనికితోడు రైల్వే శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అండర్ బ్రిడ్జిలు వర్షపు నీటితో నిండిపోయాయి. ఆయా గ్రామాలకు ఎగువకు వెళ్లడానికి ఎలాంటి మార్గం లేకపోవడంతో ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### పేరుకే కార్పొరేషన్లు...

# బిసిలకు చేయూత ఏదీ..?

### - నిధులు వెంటనే విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన

చిత్తూరురూరల్, డిసెంబరు 18 ప్రభాతవార్త: బిసి కులాల వారికి 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి బిసి ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితిగతులు మార్చినట్లు గొప్పలు చెప్పుకొంటున్న తీరు హాస్యాస్పదంగా వుందని, వెంటనే నిధులు మంజూరు చేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు డిమాండ్‌చేసారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ఓబిసి మోర్చా ఆద్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్ తన పార్టీ నాయకులకు కార్పొరేట్ పదవులను కట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసారే గాని ఇంత వరకు ఎటువంటి నిధులను విడుదల చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, ఓబిసి మోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

శాంతిపురం, డిసెంబర్ 18 ప్రభాతవార్త



మండలంలోని కడపల్లి కెజిబివి పాఠశాల విద్యార్థినులకు సోమవారం కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఉచితంగా పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. పదవ తరగతి, ఇంటర్ చదివే సుమారు వందమందికి అట్టలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, సుబ్రమణ్యం, హరీష్, శివశంకర్, ఎస్ఓ జమున, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు

## భూఆక్రమణపై గ్రామస్తులు..నేతల ధర్నా

గుడుపల్లె, డిసెంబర్ 18 ప్రభాతవార్త



మండలంలోని చిన్నగొల్లపల్లి పంచాయతీలో అధికార పార్టీ సర్పంచ్ భర్త ఆనంద్ పది ఎకరాల మేర భూములను చదును చేసి ఆక్రమించాడంటూ గ్రామస్తులు, తెదేపా,జనసేననేతలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న పశువుల మేతబీడు, గుడివ ఒక ఆలయంకు సంబంధించిన భూమిని ఆక్రమించాడని పేర్కొన్నారు. ఈ విషయంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తహశీల్దార్‌ను ప్రశ్నించగా గతంలోనే ఆస్థలంలో చెట్లు నాటొద్దని సూచించామన్నారు. అయితే ప్రస్తుతం ఆక్రమిత భూమిలో చెట్లు నాటారని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## భూఆక్రమణపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు

కుప్పంరూరల్, డిసెంబర్ 18 ప్రభాతవార్త



గుడుపల్లె మండలం సి. గొల్లపల్లిలో ప్రభుత్వ భూములను సర్పంచ్ భర్త ఆక్రమించాడని దీనిపై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డా॥ నరేష్, టిడిపి గుడుపల్లె అధ్యక్షుడు బాబునాయుడు సోమవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహంలో వారు జెసిని కలిశారు. దాదాపు పది ఎకరాల భూమిని సర్పంచ్ భర్త ఆక్రమించాడని దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఈసంఘటనపై విచారణ చేపట్టాలని ఆర్డీఓ శ్రీనివాసులుకు ఆదేశించారు.

## రాష్ట్ర ఎరుకుల సంఘం కార్యదర్శిగా శివశంకర్

బంగారుపాళ్యం, డిసెంబర్ 18 ప్రభాతవార్త:



రాష్ట్ర ఎరుకుల సంఘం ప్రధాన కార్యదర్శిగా బంగారుపాళ్యంకు చెందినబి.శివశంకర్ నియమితులయ్యారు.ఈమేరకు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ చక్రవర్తి నియామక పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన శివశంకర్ మాట్లాడుతూ ఎరుకుల హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అలాగే ఎరుక కులస్థుల సంఘ అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. ఎరుక కులస్థులపై దౌర్జన్యాలు,దాడులు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు.తనకు ఈపదవి అప్పగించిన రాష్ట్ర ఎరుకుల సంఘం నాయకులకు, కులస్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఔషధ ఆవిష్కరణ పరిశోధనలే కీలకం

తిరుపతి డిసెంబర్ 18 ప్రభాతవార్త

ఔషద ఆవిష్కరణ పరిశోధనలే సమజంలో ఏంతో కీలకమని ఇప్‌టేషన్ 2023 కో ఆర్డినేటర్ ప్రొఫెసర్, ఎ.శ్రీదేవి అన్నారు.ఇన్సిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ డ్రగ్ స్కవరి అండ్ డెవలమెంట్ రీసెంట్ అడ్వాన్సెస్ అండ్ ప్యూచర్ ట్రెండ్స్ అనే అంశంపై ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పై నిర్వహించిన సమావేశంలో పలువుఉప్రముఖులు ప్రసింగించారు.డ్రగ్స్ ఆవిష్కరణ అభివృద్ధిలో నవీకరణలపై ఔత్సాహిక నిపుణులకు అవగాహన కల్పిఆస్తరని పేర్కొన్నారు. ఔషద ఆవిష్కరణలో ఇటివల పురోగతులు కొత్త పద్ధతలను ఆయన వివరించారు. సమర్ధవంతమైన ఔషద అభివృద్ధి నియంత్రణ నిర్ణయాలను ఫార్మాకోమెట్రిక్స్ ఉపయోగాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో టి.సుధా, శైలజీ,సాంబరెడ్డి,డిభారతి, డా.అయ్యప్ప,చతుర్వేదులు,తదితరులు పాల్గొన్నారు.

## 13 పాఠశాలలో 29మంది విద్యార్థులచే అవధానం

చిత్తూరురూరల్, డిసెంబరు 18 ప్రభాతవార్త:

ఈనెల 22న రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆద్వర్యంలో ప్రతిష్టాత్మకంగా మొట్టమొదటిసారి 13పాఠశాలకు చెందిన 29మంది విద్యార్థులచే అవధాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా విభాగం కన్వీనర్ హెచ్. అరుణశివప్రసాద్ తెలిపారు. ఈ అవధాన కార్యక్రమం ఈనెల 20వ తేది గంగాధరనెల్లూరు పెడకంటిపల్లి ఉన్నత పాఠశాల నందు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం 22వ తేది శుక్రవారం బంగారుపాళ్యం మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుడిపాల మండల నరహరిపేట ఉన్నత పాఠశాల, వేపంజేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వరదప్పనాయుడు మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, పిసిఆర్ గవర్నమెంట్ హైస్కూల్, విజయం సిబిఎస్సీ హైస్కూల్, యాదమరి మండలం పిఇఎస్ పబ్లిక్‌స్కూల్, బృందావనం ఇంగ్లీష్‌మీడియం స్కూల్, విజయ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, సంషీద్ క్యాంఫోర్డుస్కూల్, విద్యావిహార్ ఇంగ్లీషు మీడియం స్కూల్, చైతన్య ఇంగ్లీషుమీడియం స్కూల్ పాఠశాలలో అవధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## బదురున్నీసా సేవలు ప్రశంశనీయం

రొంపిచెర్ల, డిసెంబరు 18 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందు కున్న ఉపాధ్యాయురాలు బదురున్నీసా సేవలు ప్రశం శనీయమని తిరుపతి డీవై ఈఓ ఆనందరెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఇటీవల బదురున్నీసా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు సాధించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ విద్యార్థులు, విద్యాభివృద్ధి చెందిడంలో ఆమె ఎంతో కృషి చేశారన్నారు. దీనికి గుర్తింపే ఈ అవార్డు అన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని తరగతి గదులు, మరుగుదొడ్ల సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓల ఇందిర, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, సర్పంచి ఇబ్రహీంఖాన్,ఎంపీటీసీ సిరాజున్నీసా, ఉపాధ్యా యులు అక్బర్‌భాషా, గంగాధరయ్య, శ్రీనివాసులు, నసీమా,ఆసీఫా,ఫయాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యంకు సిఎం జగన్ పెద్దపీట

మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, డిసెంబర్ 18 ప్రభాతవార్త



రాష్ట్రంలోని పేదల ఆరోగ్యంకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తు న్నారని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని 25లక్ష లకు పెంచుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రస ంగించారు. కుప్పం సచివాలయం -2లో మున్సిపల్ ఛైర్మన్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు కార్పోరేట్ ఆస్పత్రుల్లో సైతం రూపాయి ఖర్చు లేకుండా చికిత్స పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. రోగులకు మందులు కూడా ఇళ్ల వద్దకే డోర్ డెలివరీ చేడం జరుగుతుందన్నారు. పేదలకు మేలు కలిగిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగయ్య, నాగరాజు, కార్యదర్శి తాండవ కృష్ణ, విఆర్వో శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుల నియామకం

శాంతిపురం, డిసెంబర్ 18 ప్రభాతవార్త



బెంగళూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుడుపల్లె రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా శాంతిపురం మండల బిజెపి అధ్యక్షుడు విజి కాశీనాథ్, ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి సోగడబళ్ల గజేంద్రలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్, కుప్పం అసెంబ్లీ కన్వీనర్ శివశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు సంవత్సరాది ఏర్పాట్లుపై సమన్వయ కమిటీ సమావేశం

కాణిపాకం, డిసెంబర్ 18 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నూతన సంవత్సరాది సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టవలసిన ఏర్పాట్లుపై మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి,ఈఓ వెంకటేశులు తెలిపారు. జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబుల అధ్యక్షతన స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## 21న అరగొండలో హిందూ ధార్మిక సమ్మేళనం

తవణంపల్లె, డిసెంబర్ 18 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ శ్రీగౌరీ శంకర కళ్యాణ మండపంలో ఈనెల 21న హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమరత సేవా ఫౌండేషన్ అరగొండ కన్వీనర్ ఎం.కె.అనంత పద్మనాభయ్య తెలిపారు. ఉదయం 9 గంటలకు హిందూ సమ్మేళనం, 10 గంటలకు ధార్మిక సభ, మధ్యాహ్నం 1 గంటలకు శోభాయాత్ర జరుగుతుందని ఆయన తెలిపారు. సమరత సేవా ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంగల్‌రెడ్డి గౌరవ అతిథిగా ఈకార్యక్రమంలో జిల్లాలోని పలు ఆశ్రమాల స్వామీజీలు ముఖ్య అతిథిలుగా పాల్గొని ఆధ్యాత్మికోపాన్యాసం చేస్తారని తెలిపారు. ఈధార్మిక సమ్మేళనం కార్యక్రమంలో హిందూ బంధువులందరూ తప్పక హాజరై కార్యక్రమంను విజయవంతం చేయాలని అనంత పద్మనాభయ్య కోరారు.

## కేంద్రప్రభుత్వ పథకాల వేదిక వికసిత్ భారత్

చౌడేపల్లి, డిసెంబర్ 18 ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వేదికగా వికసిత భారత్ సంకల్పయాత్ర కొనసాగుతోంది. మండలంలోని పంచాయతీ కేంద్రా లైన దుర్గసముద్రం, కాటిపేరి గ్రామాల్లో ఈ కార్యక్ర మాన్ని చేపట్టారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో కేంద్ర ప్రభుత్వ పాత్రను వివరించారు. అర్హులైన వారికి పలు సంక్షేమ ఫలాలందించారు. ఎం పిడిఓ సుధాకర్, ఇఒఆర్‌డి కృష్ణవేణి, వ్యవసాయా ధికా రిణి జ్యోతమ్మ, వైద్యాధికారి పవన్‌కుమార్, పశువైద్యాధికారి పవన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సులోచనా, సర్పంచు సరస్వతమ్మ, సరితారెడ్డి, సచివాలయ అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## శాస్త్రసోక్తంగా సుబ్రమణ్య షష్టీ

చౌడేపల్లి, డిసెంబర్ 18 ప్రభాతవార్త

స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లీదేవసేన షణ్ముఖ సుబ్రమణ్య షష్టీ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు అర్చకులు కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయాన్నే ప్రత్యేకాభిషేకం, అలంకరణగావించారు. వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారి అర్చనలో పాల్గొన్నారు. వారికి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## యువగళం ముగింపు విజయోత్సవ వేడుకలకు ప్రత్యేక రైలు

- జిజెయం ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గురజాల జగన్మోహన్

చిత్తూరురూరల్, డిసెంబరు 18 ప్రభాతవార్త:

ఈనెల 20వ తేది విజయనగరంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం ముగింపు విజయోత్సవ సభకు 18 భోగిలతో అన్ని వసతులతో కూడిన ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిజెయం ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గురజాల జగన్మోహన్ తెలిపారు. ఈ విజయోత్సవ సభకు మంగళవారం ఉదయం 11గంటలకు చిత్తూరు నుంచి ప్రత్యేక రైలు బయలు దేరుతుందని చిత్తూరు రైల్వేస్టేషన్, పాకాల రైల్వేస్టేషన్, రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రయాణించవచ్చునన్నారు. వేడులక అనంతరం తిరిగి అదే రైలులో 21వ తేది ఉదయం 12.30గంలకు విజయనగరం నుంచి తిరుగు ప్రయాణంలో వారి వారి గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ యువగళం ముగింపు విజయోత్సవ వేడుకలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జగన్మోహన్ కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అక్కాచెల్లెమ్మలు అంటూనే అణచివేస్తారా

- 7వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

కోట, డిసెంబర్ 18 ప్రభాతవార్త



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని శాంతియుతంగా సమ్మె చేస్తుంటే మాపై ఉక్కుపాదం మోపుతున్నారని, సీఎం జగన్‌కు తమ సత్తా ఏమిటో చూపిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారానికి 7వ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా కొందరు తమ చంటిబిడ్డలను ఒడిలో కూర్చోబెట్టుకొని సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం సమ్మెను నిర్వీర్యం చేయడానికి ఎన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కా చెల్లెమ్మలు అంటూనే మా నిరసనను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన విరమించేది లేదని చెప్పారు. వేతనాలు పెంపు, గ్రాట్యుటీ, పింఛన్ అమలు తదితర డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరారు. మాకు బదులుగా సచివాలయ సిబ్బందితో పనిచే యిస్తామంటున్నారని, మరి మా సంగతి ఏమిటి, పనిచేయని మొబైల్ ఫోన్లు ఇచ్చారు, తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా జీతం ఇస్తామన్నారు, ఎన్నికల ముందు ఇచ్చిన మామీని సీఎం జగన్ మోహన్‌రెడ్డిపట్టించుకోవడం లేదని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం, సమాన పనికిసమానజీతంఇవ్వాలనికోరుతున్నాం, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని స్పష్టం చేశారు.

## ఎన్‌బికెఆర్ ఎన్‌సిసి విద్యార్థుల సైకిల్ యాత్ర

కోట, డిసెంబర్ 18 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌ట లో సోమవారం విజయ దివస్‌ను పురస్కరించుకొని ఎన్‌సిసి క్యాడెట్లు సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమా ర్‌రెడ్డి ప్రారంభించారు. 35 మంది ఎన్‌సిసి విద్యార్థులు సైకల్‌యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 1971 ఇండో-పాక్ వార్‌లో భారత్ సాధించిన విజయానికి గుర్తుగా విజయ దివస్ జరుపుకుంటున్నామని, ఇందులో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్లు సుమారు 40 కిలోమీటర్ల మేర ఈ యాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి సబ్ లెఫ్టినెంట్ మల్లికార్జునరెడ్డి, జి.మాధవయ్య, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన వరద బాధితులు

కోట, డిసెంబర్ 18 ప్రభాతవార్త



తుపాను, వరద కారణంగా కోట మండలంలోని తిమ్మానాయుడుపాలెం, కొక్కుపాడు గ్రామాల్లో పూర్తిగా ప్రజలు నష్టపోతే ప్రభుత్వం కొందరికే బియ్యం, నగదును పంపిణీ చేసిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపించారు. ఆ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలు ముట్టడించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు తుపాను, భారీ వర్షాలు కారణంగా అందరి ఇళ్లలోకి వరద ప్రవాహం వచ్చి ముంచెత్తిందని చెప్పారు. అయితే అధికారులు మాత్రం కొందరికే బియ్యం, నగదు పంపిణీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు గ్రామాల్లో ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన సందర్భంగా ప్రతి కుటుంబానికి రూ.2500 నగదు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తారని ప్రకటించినా ఇక్కడ మాత్రం అధికారులు చేయలేదని ఆరోపించారు. అయితే తహశీల్దార్ పోలీసుల సహాయం కోరడంతో ఎస్ఐ నాగబాబు, పోలీసులు వచ్చి సర్దుబాటు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అందరికీ బియ్యం, నగదు పంపిణీ చేయాలని అధికారులను కోరారు. గ్రామంలో కొందరికే ఇవ్వడం వల్ల వివాదాలు వస్తున్నాయని చెప్పారు. అనంతరం ఆయన తహశీల్దార్ పద్మావతితో మాట్లాడారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పద్మావతి మాట్లాడుతూ రెండో జాబితా పంపుతున్నామని, అందరికీ బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

## బాడుగులు చెల్లిస్తాం .. మాకు భద్రత కల్పించండి

కోట,డిసెంబర్ 18 ప్రభాతవార్త

కోటలోని ఆర్అడ్‌బి రోడ్డు పక్కన 23 కుటుంబాల వారు చిన్న చిన్న వ్యాపారులతో జీవిస్తున్నారు. అయితే వారు ఉంటున్న బాడుగు గదులు పంచాయతీకి సంబంధించి నవి అని న్యాయ స్దానం తీర్పుతో అధికారులు దుకాణదారులను అద్దెలు చెల్లించాలని కోరారు. ఆమేరకు వారికి నోటీసులు సైతం ఇచ్చారు. ఈక్రమంలో సోమవారం స్దానిక దుకాణదారులతో ఎండిపిడివో మారెళ్ల భవానీ సమాశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుకాణదారులు పలువురు మాట్లాడుతూ ఈ నెలఖరిలోపల తాము బాడుగులు చెల్లిస్తామని చెప్పారు. ఆదే క్రమంలో తామకు రక్షణ కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకొవాలని కోరారు.అధికారులు ఈ రోజు ఉంటారు రేపు బదిలీ అయ్యి వేళ్లాతారు. మళ్లీ మా సమస్య మొదటికి రాకుండా ఉండే విధంగా తమకు భద్రత కల్పించాలని వారు కోరారు.గత 27 సంవత్సరాల నుంచి తాము అనేక రకాలగా అధికారులతో వేగలేక విసిగి పోయి ఉన్నామన్నారు. పై స్దాయి అధికారులతో మాట్లాడి తమ సొంతంగా నిర్మించుకున్న గదులకు ఒక భరోసా కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎంపిడి భవాని మాట్లాడుతూ నిబంధనల మేరకు వారికి బ్రధత కల్పిస్తామని చెప్పారు. రెండు,మూడు రోజుల్లో బాడుగులు చెల్లిస్తామని దుకాణదారులు ముందుకు వచ్చారని ఆమె తెలిపారు. సమావేశంలో ఇఒ నయాయిమ్, కార్యదర్శి శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత కుటుంబానికి వేనాటి నివాళి

దొరవారిసత్రం, డిసెంబర్ 18 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం బూదూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆలూరు శీనయ్య (75) సోమవారం మృతిచెందారు. సమాచారం అందుకున్న తిరుపతి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి తదితరులు ఆలూరు శీనయ్య ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బూదూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి పనిచేసిన శీనయ్య గ్రామానికి పలు అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. అనంతరం శీనయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గునకల చంద్రయ్య, వై.చంద్రశేఖర్‌రెడ్డి, బొబ్బిలినాయుడు, నల్లపాటి చెంగయ్య తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయం

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ

గూడూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాల న్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో జరిగిన కొత్త ఫిచర్లతో స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదవాడి ఆరోగ్య శ్రీ కార్డు 5 లక్షల నుండి 25 లక్షల వరకు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుండి సిఎం జగన్ వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా కొత్త ఫిచర్లతో స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫిరెన్స్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు పించను కోసం క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇంటి వద్దకే పించన్లు ఇస్తున్నారన్నారు. పేదలకు సేవ చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు సురేష్ రెడ్డి, గోపాల్ యాదవ్, జమళ్ళ వాసు, సాయి, ఇమ్రాన్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పిష్‌కాన్ అధ్యక్షునిగా తడ శివాజీ ఎన్నిక

తడ,డిసెంబర్ 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పిష్ కాన్ రాష్ట్ర కార్యవర్గం సోమవారం నూతన కమిటిని ఏక గ్రీవంగా ఎన్నుకుంది. విశాఖపట్టణం లో జరిగిన ఈ సమావేశంలో తడ మండలం పూడి కుప్పం గ్రామానికి చెందిన ఆర్. శివాజీని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా లో తడ ప్రాంతం చేరిన తరువాత ఈ కమిటి అధ్యక్షులుగా శివాజీ ఎంపిక కావడం విశేషం. గతంలో పులికాట్ సరస్సు పై ఆధారపడిన జాలర్ల సమస్యలపై అనేక పోరాటలు జరిపారు.

## సచివాలయం భవనానికి అద్దె చెల్లించాలని నోటీస్ బోర్డు పెట్టిన యజమాని

వెంకటగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త

పట్టణంలోనే పదవ సచివాలయం భవనానికి నాలుగు నెలల నుండి అద్దె చెల్లించలేదని కరెంటు బిల్లు కట్టలేదని వెంటనే ఖాళీ చేయాలని యజమాని నోటీసు బోర్డు పెట్టారు. 30 రోజుల్లో లోపల భవనాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించారు. 23376 కరెంట్ బిల్లుతో సహా బాడుగ చెల్లించాలని కోరారు. యజమాని నోటీస్ బోర్డు పెట్టడంతో సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కొత్త భవనంలోకి మార్చుకోవాలని సచివాలయం ఉద్యోగులు భావిస్తున్నారు.

## దక్షిణ రైల్వే కమిటి సభ్యులుగా సారంగం రమేష్ బాబు

కోట,డిసెంబర్ 18 ప్రభాతవార్త

చైన్నై డివిజన్‌ల్లోని దక్షిణ రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటి సభ్యులుగా కోట మండల భాజపా అధ్యక్షులుగా డాక్టర్,సారంగం రమేష్‌బాబు ను దక్షిణ రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ నియమించారు. ఈ మేరకు రమేష్ బాబు కు పలువురు భాజపా నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు విలేకర్లతో మాట్లాడుతూ తన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి తనకు ఇచ్చిన పదవికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానాని పేర్కొన్నారు.

## అయోధ్య శ్రీరామ అక్షతార్చనం

వాకాడు, డిసెంబర్ 18, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని సోమవారం శ్రీ పట్టాభిరామాలయంలో అయోధ్య నుండి పంపబడిన అక్షతలకు విశేష పూజాధికాలను వాకాడు సొసైటి ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి చేత ఆలయ ప్రధాన అర్చకులు దీని అనంతాచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ హిందువుల శతాబ్దాల కల సాకారం అయ్యే శ్రీ రామ మందిరం జనవరి 22వ తేదిన ప్రాణ పతిష్ట జరుపుకుంటున్న శుభ సందర్భంగా అయోధ్య శ్రీ రామ మందిరం నుండి దేశవ్యాప్తంగా అక్షతలను డిసెంబర్ నెలలో పంపడం జరిగిందని, మన రాష్ట్రంలో విశ్వహిందూ పరిషత్తు ద్వారా జిల్లాలకు, తద్వారా మండలాలకు వాటిని సమరసత సేవా సంస్థ ద్వారా అందించడం జరిగిందన్నారు. వాకాడు, చిట్టమూరు రెండు మండలాలలోని 40 పంచాయితీలకు సంబంధించి అక్షతలను తన స్వగ్రామమైన బాలిరెడ్డిపాలెంలోని శ్రీ పట్టాభిరామాలయానికి రావడం చాలా ఆనందకరమైన, అదృష్టకరమైన విషయం అన్నారు. ఈ అక్షింతలను జనవరి 22వ తేదిన అయోధ్యలోని శ్రీరామ మందిర ప్రాణప్రతిష్ఠ ముహూర్త సమయంలో రామనామాన్ని జపించి శిరసును దాల్చడం ద్వారా శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్టలో పాల్గొన్నంతటి అదృష్టం కలిగేలా ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దువ్వూరు మనోహర్ రెడ్డి, బుర్లా నరేంద్ర రెడ్డి, కిషోర్, వినయ్, అశోక్, శ్రీరామసేన అధ్యక్ష, కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి, పోలిపాటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్రమణ్యస్వామి ఆలయంలో షష్టి పూజలు

బాలాయపల్లి, డిసెంబర్ 18, ప్రభాతవార్త



సుబ్రమణ్య గ్రామంలో వెలసి ఉన్న షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా షష్టి పూజలు నిర్వహించారు. సుబ్రమణ్య స్వామి పుట్టినరోజు వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## సిఎం జగన్మోహన్ రెడ్డి వల్లే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త



సిఎం జగన్మోహన్ రెడ్డి వల్లే అభివృద్ధి సాధ్య మవుతుందని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 12వ వార్డు పరుమల్లమ్మ గుడి వీధిలో ఆయన మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటిని సిఎం నెరవేర్చినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వాన్ని మరల అందరూ ఆదరించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్ రెడ్డి నేరుగా ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానికులు సమస్యలను రాంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వెంకటరామయ్య, వైసిపి జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ పట్టణ కన్వీనర్ డిల్లీ బాబు, కౌన్సిలర్లు, శివయ్య, గోపాలకృష్ణ, సుబ్బారావు, నారాయణ, కళ్యాణి, పూజారి లక్ష్మి, నాయకులు లక్కమనేని కోటేశ్వరరావు, మురళీకృష్ణ

## రైతులు పంట నమోదు చేసుకోవాలి

వెంకటగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త

రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏడిఏ నాగార్జున సాగర్ తెలిపారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో ఆయన ఏవోలు, విఏఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం అందించే పథకాలు వస్తాయని తెలిపారు. పంట బీమా, రైతు భరోసా, కౌలు రైతుల కార్డు సున్నా వడ్డీ తత్తర పథకాల కోసం రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. గొట్లగుంట గ్రామం వెళ్లి పంట నమోదును పరిశీలించారు. ఆయన వెంట సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారమ్మకు వెండిపాదాలు వితరణ



**కార్వేటినగరం, డిసెంబరు 18 ప్రభాతవార్త:** కార్వేటినగరం గ్రామదేవతయిన బంగారమ్మకు స్థానిక భక్తుడు వెండిపాదాలు వితరణ చేశారు. కార్వేటినగరంకు చెందిన తపాలా కార్యాలయ గోపాల్‌నాయుడు కుటుంబ సభ్యులు 750గ్రాముల విలువ చేసే వెండిపాదాలు,జాతరకు పసుపు,కుంకుమ,బొందారాలు అందించారు. కార్యక్రమంలో ఆలయఅధ్యక్షులు కొప్పేటిప్రసాద్,కార్వేటినగరం ఎంపిపి లతాబాలాజీ,భక్తులు పాల్గొన్నారు.

## పాతార్కాడులో పారిశుధ్య చర్యలు



**విజయపురం, డిసెంబరు 18 ప్రభాతవార్త :** మండలంలోని పాతార్కాడు పంచాయతీలో సోమవారం సర్పంచ్ బొబ్బిలి పారిశుధ్య చర్యలు నిర్వహించారు. పైప్‌లైన్ లీకేజీ ప్రాంతంలో మరమ్మతు చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపుల వున్న పిచ్చి మొక్కలను తొలగించారు. పంచాయతీలో ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారి చేయనున్నట్టు తెలిపారు.

## సమగ్ర శిక్ష సిబ్బంది నిరసన



**విజయపురం, డిసెంబరు 18 ప్రభాతవార్త :** మండలంలోని విద్యా వనరుల కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది సోమవారం ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహనరెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సంవత్సరాల తరబడి పనిచేస్తుంటే ప్రభుత్వం పటి ్చంచుకోవడం లేదని, సమగ్ర శిక్ష సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## మాజీ కౌన్సిలర్ మృతి



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తికి చెందిన 15వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ జానిబాషా సోమవారం వేకువ జామున మృతి చెందారు.కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌గా జాని బాషావార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేసారు.ఆయన జీవిత కాలం కాంగ్రెస్ పార్టీ మద్దతు దారుడుగానే కొనసాగారు. పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకున్నా జాని బాషా ఉమ్మడి చిత్తూరుజిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగారు. ఆయన మృతికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి,శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బత్తెయ్యనాయుడు నివాళులర్పించారు. ఆయన మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు.ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన విజయశేఖర్, టి.శివకుమార్,వెంకటముని, శివయ్య, గోపి నాగూరయ్య, రాఘవరెడ్డి,సురేష్ తదితరులు హాజరై నివాళులర్పించారు.వారికి కుటుంబానికి సానుభూతి తెలిపారు. కాగాశ్రీకాళహస్తిలోకిరాణషాపుఏర్పాటు చేసి నిర్వహించిన జానిబాషాకు పరిచయస్తులు నివాళులర్పించారు.

## ఎంఎస్ఎం కోర్‌కమిటి సభ్యులుగా నియామకం

**ఏర్పేడు,(శ్రీకాళహస్తి రూరల్),డిసెంబర్ 18 ప్రభాతవార్త**

ఎంఎస్ఎం ఈ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా కోర్ కమిటి సభ్యులుగా ఏర్పేడు మండలం చిందేపల్లికి చెందిన జి.పార్థసారధిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. కేంద్ర ప్రభుత్వ సూక్ష్మచిన్న మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సారధ్యంలో ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తిరుపతి జిల్లా కోర్ కమిటి సభ్యులుగా పార్థసారధిరెడ్డిని ఎంపిక చేసారు. ఆయనను మూడు సంవత్సరాల పాటు కమిటి సభ్యులుగా కొనసాగుతారు. తిరుపతి జిల్లా నుంచి కోర్ కమిటి సభ్యులుగా పార్థసారధిరెడ్డిని ఎంపిక చేసారు. పరిశ్రమలపై దృష్టి ఉన్న వారందరికి ప్రయోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సారధ్యంలో సబ్సిడీలు కల్పించటం మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తారని పార్థసారధి రెడ్డి వివరించారు.

## ముదిరాజ్‌సంఘం సహాయం

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి ముదిరాజ్ సంఘం తరపున ఓ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధికి చెందిన కొప్పాల ఎల్లయ్య ముదిరాజ్(35) గుండెపోటుతో మృతి చెందారు. నిరుపేద కుటుంబమైన సభ్యులకు ఇంటి యజమాని మృతితో ఆధారం కోల్పోయారు.ఈ సమస్యను గుర్తించిన సంఘం తరపున తమ వంతు సహాయంగా ఆయన కుమార్తె రేణుకాభానుపేరిట రూ.35వేలు బ్యాంకులో ఫిక్సడ్ డిపాజిట్ చేసి అందించారు.ఈ కార్యక్రమాల్లో అధ్యక్షులు వల్లమ కన్నయ్య, వర్కింగ్ అధ్యక్షులు వైవి రమణయ్య, గౌరవాధ్యక్షులు పిళ్ళారి బత్తినయ్య, చిట్టేటి చిన్న సుధాకర్, ప్రధాన కార్యదర్శి అల్లిపూడి వేంకటేశ్వర్లు,కోశాధికారి బొజ్జ గోవిందస్వామి, గౌరవ సలహాదారుతోటకూర కోటేశ్వరరావు,పట్టణ అధ్యక్షుడు కోనేటి అయ్యప్ప,యువత అధ్యక్షుడు ఆకుల గురుమూర్తి, ఆర్.సుబ్రమణ్యం, సత్రవాడ సతీష్,జి.రాజామతంరాజేంద్ర,భాస్కర్‌పెంచులయ్య,వెంకటకృష్ణయ్య,శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వార్డుల్లో ఇంటింటా ఫైలేరియా పరీక్షలు

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 18 ప్రభాతవార్త** జిల్లా వైద్యాదికారుల ఆదేశాల మేరకు వార్డుల్లో ఇంటింటా ఫైలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో సోమవారం 14వ వార్డులో ఎఎన్ఎం మునిపావని ఆధ్వర్యంలో ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించి వాటిని గజేంద్రనగర్‌లోని సబ్‌సెంటర్‌కు పంపుతారు. ఇక్కడ పరీక్షల అనంతరం వారికి ఫలితాలను తెలుపుతామన్నారు. వైద్యాదికారి ఆదేశాల మేరకు వార్డుల్లో ప్రజలకు రక్తనమూనాలు సేకరిస్తున్నామన్నారు. సుమారు 100మంది వరకు రక్తనమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నట్లు తెలిపారు. ఎఎన్‌ఎంతో పాటు ఆశావర్కర్లు పి.ఈశ్వరి, పి.ధనలక్ష్మి, ఎ.పద్మావతి,ఇ.మునిలక్ష్మి.బి.కృష్ణకుమారిలతోపాటువాలంటీర్లు సర్దార్, పరమేశ్వరి, భరత్ పాల్గొన్నా రు.

## వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ రూ.25లక్షలు వరకు పెంచడంపై హర్షం



**తొట్టంబేడు, డిసెంబర్ 18 ప్రభాతతవార్త** డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య పథకం కింద నిరుపేదలకు వైద్యసేవల ఖర్చులకు ముఖ్యమంత్రి రూ.25లక్షలు వరకు పెంచడం హర్షణీయమని మండల ఎంపిపి ఉన్నం నిర్మల, వైకాపా సీనియర్ నాయకుడు ఉన్నంవాసుదేవనాయుడు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సోమవారం తొట్టంబేడు మండలపరిషత్ కార్యాలయంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వైకాపా సీనియర్‌నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో మరిన్ని మెరుగులు దిద్దుతూ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఉపయోపడుతుందన్నారు. ఇక ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటింటా వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్‌బాబు, ఈఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

## వరుస చోరీలతో జనం భయం భయం



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పట్టణంలో వరుస చోరీలతో జనం భయభ్రాంతులౌతు న్నారు. ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మగుడి, గాంధీవీధుల్లో చోరీలు జరిగినట్లు సమాచారం.అయితే ధృవీకరించుటకు సంబంధించి పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.గత కొంతకాలంగా దొంగల భయం లేకుండా ఉన్నారు. పోలీసులు రాత్రి గస్తీలు తిరుగుతున్నారు.కానీ రాత్రి 10గంటలకే నాలుగుమాడావీధుల్లో దుకాణాలు, లాడ్జిలు మూయించటానికి పోలీసులు శ్రద్ధ చూపుతున్నారు. కానీ ప్రధాన వీధుల్లో గస్తీ ప్రశ్నార్థకంగా మారింది. ఆదివారం రాత్రి ముత్యాలమ్మగుడివీధిలో రెండు ఇళ్ళలో చోరీ జరిగినట్లు సమాచారం. ప్రియా టైలర్స్ యజమాని చంద్రశేఖర్ కుటుంబసభ్యులతో హైదరాబాదు వెళ్ళారు. ఆ ఇంటి తాళాలు పగుల గొట్టి దొంగలు చోరికి పాల్పడ్డారు. అయితే ఇక్కడ ఎంత చోరీ జరిగిందో తెలియలేదు. వారికి సమాచారం అందించారు. వారు వస్తే తప్ప ఎంత చోరీ జరిగిందనే విషయం స్పష్టం కాదు.కాగా ఇక్కడే రాజేశ్వరి అనే మహిళ చెన్నైకు వెళ్ళారు.ఈ ఇంటిలో 36 గ్రాముల బంగారు నగలు, వెండి ఉరువులు, సుమారు రూ.5వేల నగదు చోరికి గురైనట్లు ప్రాధమిక సమాచారం.అంతేకాక గాంధీవీధిలో కూడా చోరీలు జరిగినట్లు చెబుతున్నారు. చోరీలు జరిగిన ఇండ్లను, ప్రదేశాలను అర్బన్ సిఐ అంజూయాదవ్ పరిశీలించారు.

## యువగళం ముగింపు సభను విజయవంతం చేయండి

-నియోజకవర్గం నుంచి 5వేలమంది

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 18 ప్రభాతవార్త** తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువగళం నేత నారాలోకేష్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఏడాది జనవరి 27న కుప్పం నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్ర 97అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 3123 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తిచేసుకుందని విశాఖలో జరిగే పాదయాత్రకు తెదేపా అధినేత నారాచంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కళ్యాణ్, హిందూపురం శాసనసభ్యులు నందమూరిబాలకృష్ణలు హాజరవుతారన్నారు. శ్రీకాళహస్తి నియోజవర్గం నుంచి సుమారు 5వేలమంది వరకు బయలుదేరనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రెడ్డివారిగురవారెడ్డి, మిన్నల్‌రవి, కాసరం రమేష్, గోగినేని సురేష్, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## శ్రీసిటీ డిఎస్పీపై చర్యలు చేపట్టాలి -సిపిఎం డిమాండ్

**సత్యవేడు, డిశంబరు 18, ప్రభాతవార్త:**

శ్రీసిటీ పారిశ్రామిక వాడలో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జగదీష్ నాయక్ పై చర్యలు చేపట్టి, తక్షణమే ఇక్కడ నుండి బదిలీ చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ళ తరబడి శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో సిఐఆ పనిచేసి, డిఎస్పీగా పదోన్నతి వస్తే మళ్ళీ శ్రీసిటీలోనే పోస్టింగ్ వేపించుకుని ఇక్కడకు వస్తున్న భాదితుల ఫిర్యాదులను నీరుగారుస్తూ, న్యాయంచేయకుండా వేధిస్తున్న శ్రీసిటీ డిఎస్పీ జగదీష్ నాయక్‌పై జిల్లా అధికారులు చర్యలు తీసుకుని, బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సత్యవేడు మండలంలోని రాచపాళ్యెంకు చెందిన దళితుడు కుమార్‌ను కొందరు అగ్రకులస్తులు హత్య చేయగా దానిని అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచారణ చేయకుండా మృతుడు భార్యకు డబ్బులు ఇప్పిస్తామంటూ నిందితులతో కుమ్మక్కై కేసు ధర్యాప్తులో కాలయాపన చేస్తున్నారమని విమర్శించారు. ఈకేసు విషయమై ఎస్సీ కమీషన్ ఛైర్మెన్ విక్టర్ ప్రసాద్, జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నా..అక్కడ నుండి ఆదేశాలు వచ్చినా కూడా డిఎస్పీ ఏమి విచారణ చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. డిఎస్పీపై చర్యలు చేపట్టాలని కోరుతూ శ్రీసిటీ పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

## ఘనంగా పెన్షనర్స్‌డే వేడుకలు

**నగరి, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



పట్టణ పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల్లోనే విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయచంద్రుడు, కార్యదర్శి పెన్షనర్స్ డే ప్రాముఖ్యతను తెలుపుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరి, విజయపురం, నిండ్ర, పిచ్చాటూరు మండలాలకు చెందిన పలువురు పెన్షనర్లు ఈ సంఘంలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఉప ఖజానా అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్లు తీసివ్వడంలోను, పెన్షన్ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవడంలోను పెన్షనర్ల సంఘం తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నగరి పెన్షనర్ సంఘ వ్యవస్థాపకులు, సంఘ రెండో అంతస్తులు గది నిర్మాణ దాత అయిన బి.భాస్కరన్ మాట్లాడుతూ విశ్రాంత సభ్యులు అందరూ ఒక్కటిగా చేరి ఒక భవనాన్ని నిర్మించుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గర్వించదగ్గ అంశమన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణ స్థల దాత సరస్వతి నిర్మల రాజగోపాలరాజు మాట్లాడుతూ విరమణ పొందిన ఉద్యోగులు సమాజసేవలో తాము ముందున్నామని చాటుకుంటున్నారన్నారు. పదవీ విరమణ చేసి 15 సంవత్సరాలు నిండిన పెన్షనర్లు ఏఎన్ శ్రీనివాసన్, ఏ.మోహన్, పి.గోపాల్‌రెడ్డి, వి.కుమరేవన్, ఏ.రాజేంద్రన్, ఓ.ధనంజయులు, డి.సుబ్రహ్మణ్యం, ఎన్.దొరైరాజు, జి.నీలకంఠుడు, ఎం.జయపాల్‌రెడ్డి, ఏజీ ఉమాశంకర్, కె.నాగమణి, ఏ.వరలక్ష్మమ్మ, డి.రామమూర్తి, ఏ.రామమూర్తి, టి.వి.ప్రభావతిలను విశ్రాంత ఉద్యోగులు శాలువలతో సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రన్, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి, అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు చెంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గురురాజారావు, నగరి ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం, విజయపురం ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గ సభ్యులు ఎం.ఏ.జయరామన్, జనార్ధన్, డి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన ఆర్ఐవో

**పిచ్చాటూరు, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



పిచ్చాటూరు జడ్పీ హైస్కూలులో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఉదయం ఇంటర్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పిచ్చాటూరు జడ్పీ హైస్కూలులో ఇంటర్ విద్యార్థులకు జరగబోయే పరీక్షా కేంద్రాన్ని పరిశీలించామని వారికి కావలసిన సదుపాయాలు గదులు, డెస్కులు, అన్ని ఉన్నాయని చుట్టు పక్కల ఉన్న 8 కళాశాల విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని వసతులు ఉన్నాయని ఇంకా రెండో కేంద్రాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలోఎంఈవో యుగంధర్‌రాజు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, జడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు గిరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆరేటమ్మ ఆలయ పూజారి అనారోగ్యంతో మృతి

**పుత్తూరురూరల్, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని గ్రామదేవత ఆలయ పూజారి రత్నం(80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గత 25 సంవత్సరాలకు పైగా ఆయన ఆలయ అర్చకులుగా పని చేస్తున్నారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఆలయ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, శ్రీ ద్రౌపదీదేవి ఆలయ ఛైర్మన్ లారీ మోహన్, శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు.

## సంక్షేమ సారథికే సారధ్యం అప్పగించండి..!

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

**చంద్రగిరి, డిశంబర్ 18 ప్రభాతవార్త:**



సంక్షేమ సారధి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే మరోసారి సారధ్య బాధ్యతలు అప్పగించాలని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి పంచాయతీలో సోమవారం ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైసిపి యువజన నాయకుడికి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని బిసి కాలనీలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించిన ఆయన అక్కడి నుండి ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రతి కుటుంబానికి అందిస్తున్న నగదు కారక పథకాలను వివరించారు. మా తండ్రి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆశీస్సులతో 2024 సాధారణ ఎన్నికలలో ఎంఎల్ఏ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న మా అన్నయ్య చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

## వైద్య రంగంలో ఫార్మసిస్టుల సేవలు కీలకం

కృపానిధి కాలేజ్ ఆఫ్ ఫార్మశీ అడమిక్ డైరెక్టర్ కర్వేకర్

**రామచంద్రాపురం, డిశంబర్ 18 ప్రభాతవార్త:**



వైద్య రంగంలో ఫార్మసిస్టుల సేవలు కీలమని కృపానిధి కాలేజ్ ఆఫ్ ఫార్మశీ (బెంగుళూరు) అడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.డి.కర్వేకర్ అన్నారు. సోమవారం వెంకట్రామాపురం సమీపంలో సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల "డిజైన్, క్రిటికల్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ డిజైన్ ఇన్ అనలిటికల్ కెమిస్ట్రీ" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై ప్రయోగాలు చేయాలని కోరారు. ప్రయోగ పద్ధతిలో ఫార్మశీరంగం ఎంతో ముందుకు సాగుతుందన్నారు. ఫార్మశీ రంగంలో అనేక అవకాశాలు వున్నాయనీ, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఎం.సి.హెచ్ కాలేజ్ ఆఫ్ ఫార్మశీ కోయంబత్తూరు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రాజశేఖర్, కళాశాల కరస్పాండెంట్ యం.సుమలత, ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు, ఫార్మస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ జి.సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నను గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం

**రేణిగుంట, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి మరలా గెలిపించుకుని రాష్ట్రాన్ని ఇంకా అభివృద్ధి చేసుకుందామని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి కోరారు. రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ వేమాపురం సంజీవరెడ్డి కాలనీలో గ్రామ సచివాలయంలో జగనే ఎందుకు కావాలి(వై ఏపీ నీడ్స్ జగన్) సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్పంచ్ పార్టీ జెండాని ఎగురవేసి పంచాయతీ అభివృద్ధికి వినియోగించిన నిధులకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నిజమైన ప్రజా సేవకునిగా అభివర్ణించారు. వైసీపీని గెలిపించుకుని జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా మధుసూదన్‌రెడ్డిని తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రత్నమ్మ, శివాలయ కార్యదర్శిసాయి మురళీకృష్ణ, తండం సచివాలయ కార్యదర్శి లావణ్య లత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 7వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

**రేణిగుంట, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



రేణిగుంట పంచాయతీ పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె సోమవారానికి 7వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రేణిగుంట నుంచి దాదాపు 60 మంది అంగన్‌వాడీ వర్కర్లు శ్రీకాళహస్తిలో ఆర్డీవో కార్యాలయం ముట్టడికి వెళ్లారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు శ్రీకాళహస్తినియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నేతలు రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా నాయకత్వంలో భోజన సదుపాయాన్ని సమకూర్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి హరినాథ్, సీపీఎం పార్టీ సీనియర్ నేత వెంకటరమణ, కేవీపీఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అధ్యక్షురాలు ధనమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## మేఘన లే అవుట్ ప్రజలకు కరెంట్ కష్టాలు నుండి విముక్తి

మల్లవరం సర్పంచ్ కృషితో...మేఘన లే అవుట్‌కు విద్యుత్ సరఫరా

**తిరుపతిరూరల్, డిసెంబర్18 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ సి.మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలోని మేఘన లే అవుట్ ప్రజలకు కరెంట్ కష్టాలు తీరినట్లే. గ్రామ సర్పంచ్ మొక్కల భారతి తిమ్మారెడ్డి సహకారంతో మేఘన లే అవుట్‌కు విద్యుత్ స్తంబాలను సోమవారం ఏర్పాటు చేసారు. ఎన్నో సంవత్సరాలు ఆవిష్కృతమై వున్న విద్యుత్ సమస్యకు సర్పంచ్ కృషితో నూతన పోల్స్, లైన్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. గడప గడపకు కార్యక్రమంలో మేఘన లే అవుట్‌లో పర్యటించిన చెవిరెడ్డి లక్ష్మీకి స్థానిక ప్రజలు కరెంట్ కష్టాలు గురించి వివరించారు. సర్పంచ్ స్పందించి రూ.5లక్షల వ్యయంతో విద్యుత్ సరఫరాతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## మోహిత్‌రెడ్డిని....మీ బిడ్డగా భావించి, ఆదరించండి

- గడప గడపకు ఆత్మీయ పలకరింపులో చెవిరెడ్డి లక్ష్మీ

**తిరుపతిరూరల్, డిసెంబర్18 ప్రభాతవార్త:**



చంద్రగిరి నియోజకవర్గం వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మీ బిడ్డగా భావించి వచ్చే సార్వత్రిక ఎన్నికలలో అఖండ మెజార్టీతో గెలిపించాలని చెవిరెడ్డి లక్ష్మీ కోరారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమం సోమవారం తిరుపతిరూరల్ కుంట్రపాకం గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి విచ్చేసిన చెవిరెడ్డి లక్ష్మీకి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతి గడపకు వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి ఆరా తీయడంతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధి గురించి వివరించారు. లబ్దిదారులకు సంక్షేమాలు అందకుంటే వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపే ఏర్పాట్లు చేసారు. మోహిత్‌రెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ...ప్రజాసేవే దైవంగా భావించి, అభివృద్ధికి కృషి చేస్తాడని తెలిపారు. ప్రజాసేవ చేయాలనే తపనతోనే మోహిత్ రాజకీయాల్లోకి వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుంట్రపాకం గ్రామ సర్పంచ్ రాజపాళ్యం శుభ పద్మనాభరెడ్డి, వైకాపా సీనియర్ నేత కరమల్ల వల్లీ, హుస్సేన్, రఫీ, ఎంపిటిసి, స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## యువగళం ముగింపు సభకు తరలిరండి

టిడిపి నాయకుల విజ్ఞప్తి

**పుత్తూరు, డిసెంబరు 18 ప్రభాతవార్త :**



ఈ నెల 20వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో నిర్వహించే యువగళం ముగింపు సభకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని టిడిపి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎస్.ధనపాల్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ రాష్ట్రంలో 97 నియోజకవర్గాల్లో 226 రోజుల పాటు 3132 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేసిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వైసిపి ప్రభుత్వ పాలనలో లోపాలను ఎండగట్టారని తెలిపారు. ముగింపు సభకు వెళ్లేందుకు చిత్తూరు నుంచి 00700 నెంబరు ప్రత్యేక రైలు బయలుదేరుతుందని, ఆ రైలు 19వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని, అలాగే అదే రోజు మధ్యాహ్నం 2.00 గంటలకు తిరుపతి స్టేషన్ నుంచి 00702 ప్రత్యేక రైలు బయలుదేరుతుందని తెలిపారు. రాత్రి భోజనం రైలులోనే పార్టీ ఏర్పాటు చేస్తుందన్నారు. సభ ముగిశాక ఇవే రైళ్లు తిరుగు ప్రయాణం చేస్తాయని, పార్టీ శ్రేణులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సభకు తరలిరావాలని కోరారు.

## పుత్తూరు విద్యార్థిని కవితకు ప్రజ్ఞా పురస్కారం

**పుత్తూరు, డిసెంబరు 18 ప్రభాతవార్త :**



ప్రజ్ఞా పురస్కారం - 2023లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థిని డి.ఎస్.కవిత రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ కాలేజీ విద్యాశాఖ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రజ్ఞా వార్షిక ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. ఇందులో అత్యధిక మార్కులు సాధించిన వారికి గత శనివారం అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో ప్రజ్ఞా పురస్కారాలను అందించారు. బికామ్ (జనరల్)లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన కవితకు విదా య్ శాఖ కమిషనర్ పోలా భాస్కర్ జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితే మంచి భవిష్యత్ వుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.నరసింహులు, డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ జి.గంగయ్య పాల్గొన్నారు.

## దళితుల భూములను కబ్జా చేసిన ఎమ్మెల్యే అనుచరులను అరెస్ట్ చేయాలి

-దళిత నాయకులు చింతమాకుల రెడ్డెప్ప

**తిరుపతిరూరల్, డిసెంబర్18 ప్రభాతవార్త:**



దళితుల భూములను ఆక్రమించిన ఎమ్మెల్యే అనుచరులను అరెస్ట్ చేయాలని రాష్ట్ర దళిత నాయకుడు చింతమాకుల రెడ్డెప్ప డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. చెన్నాయగుంట గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 229లో వున్న ప్రభుత్వ భూమిని 1983లో దళితులకు కేటాయించినట్లు తెలిపారు. దళితులకు కేటాయించిన భూమిని ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి అనుచరులు కబ్జా చేసారని ఆరోపించారు. దళితుల భూములను కబ్జా చేసిన ఎమ్మెల్యే అనుచరులపై తిరుచానూరు పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినప్పటికి, ఇప్పటివరకు ఆక్రమణదారులను అరెస్ట్ చేయలేదని రెడ్డెప్ప ఆవేదన వ్యక్తం చేసారు. దళితులకు కేటాయించిన భూమిలో తిరుపతి అర్బన్ తహశీల్దార్ 145 సెక్షన్, సి.ఆర్.పి.సి. విధించినా కూడా ఎమ్మెల్యే ఆదేశించారని తహశీల్దార్ నిస్సహాయతను ప్రకటించినట్లు తెలిపారు.టి.టి.డి కాంట్రాక్టరు పళణి యాదవ్ దళితుల భూముల యందు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని తెలిపారు. అక్రమ నిర్మాణదారుడు పళణి నిలదీస్తే సహచర ఆక్రమదారులు కూడా దళితులపైదాడులుదిగారనివాపోయారు.చెన్నాయగుంటదళితులభూముల ఆక్రమణను నిరసిస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి, స్పందనలో కూడా భూ కబ్జాదారులపై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

## నూతన సంవత్సరం క్యాలెండర్ల ఆవిష్కరణ

**నగరి, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



పట్టణ పరిధి బైపాస్ కూడలి వద్ద గల ఓంశక్తి ఆలయంలో నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు.సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు రాజా కుల్లయప్ప, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. రామచంద్రన్, డా. అంబ్రోస్ విల్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొని క్యాలెండర్లను ఆవిష్కరించారు. శక్తిమాల ధరించి ఇరుముడి యాత్రలో పాల్గొనే భక్తులందరికి క్యాలెండర్లు ఉచితంగా అందిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## 7వ రోజు కొనసాగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె

**నగరి, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



అంగన్‌వాడీ వాళ్ళ సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం అంగన్‌వాడీలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీ సెంటర్లను బలవంతంగా తలుపులు పగులగొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అంగన్‌వాడీ ఐక్య పోరాట సమితి నగరి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనకోటి మునెమ్మ, ఉమ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ కోదండయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌నాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు తమ న్యాయమైన అంటే సమస్యలు పరిష్కారానికి జీతాలు పెంచాలని కోరి అంగన్‌వాడీ వాళ్ళ రోడ్డెక్కితే అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ వాళ్ళను మహిళలని చూడకుండా చులకనగా బలిసి సమ్మెకు పోయి రోడ్డులో కూర్చుంటున్నారని చెప్పడాన్ని తీవ్రంగా కార్మిక సంఘాలు ఖండిస్తున్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరి ఆర్డీవోకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యం, యూనియన్ నాయకురాలు విజయ ధనకోటి, వరలక్ష్మి, మునెమ్మ, పంచా వర్ణం, కస్తూరి, విజయ, శాంతి, భవాని, శోభ, శైలజ, లక్ష్మి, షిలా, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వేలన్ బాషా, శేఖర్, సీఐటీయూ నాయకులు పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి సీఎం సహాయనిధి ద్వారా వినికిడి యంత్రం

**నగరి, డిసెంబరు 18 ప్రభాతవార్త:**



విజయపురం మండలం ఎం అగరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పి.బాలకృష్ణనాయుడు కుమారుడు 10వ తరగతి చదువుతున్న పి.యోగి కుమార్‌కు వినికిడి యంత్రం ఏర్పాటుకు సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరైంది. విద్యార్థికి వినికిడి సమస్య తీవ్రంగా ఉండడంతో సర్జరీ ద్వారా వినికిడి యంత్రం అమర్చాలని వైద్యులు సూచించారు. అయితే సర్జరీకి లక్షల్లో ఖర్చవుతుందన్నారు. దీంతో బాలకృష్ణమనాయుడు మంత్రి రోజాను సంప్రదించి విద్యార్థి పరిస్థితిని వివరించి సాయం అందించాలని కోరారు. పరిస్థితిని అర్థం చేసుకున్న మంత్రి వెంటనే సీఎం సహాయనిధి విభాగానికి విద్యార్థికి వినికిడి యంత్రం ఆవశ్యకతను వివరించి రూ.2 లక్షల నిధులు మంజూరు చేయించారు. సోమవారం తన నివాసంలో విద్యార్థికి నిధులకు సంబంధిత ఎల్‌వోసీని అందించారు.

# అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం



అంగన్‌వాడి నిరవధిక సమ్మెలో పాల్గొన్న మాజీ ఎంపి చింతామోహన్

గూడూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు అంగన్వాడి కార్యకర్తల నిరవధిక సమ్మె సోమవారంకు ఏడవ రోజుకు చేరుకుంది. గూడూరు వెంకటగిరి, కోట, తదితర ప్రాజెక్టు నుండి సుమారు 1000 మందికి పైగా అంగన్వాడీ కార్యకర్తలు సబ్ కలెక్టర్ కార్యాలయంకి చేరున్నారు. నినాదానలతో సబ్ కలెక్టర్ కార్యాలయం దద్దరిల్లింది. అనంతరం ఆర్డిఓ కిరణ్ కుమార్‌కి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఆయన వెంటనే స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌కి అందచేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, మాజీ ఎంపి చింతామోహన్ కూడా వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని, వేతనాలు పెంచాలని గ్రాడ్యుయటీ అమలు చేయాలని, పెన్షన్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఆయన డిమాండ్ చేసారు. రాజ్యాంగబద్ధంగా మా హక్కుల కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లు తాళాలను ప్రభుత్వ ఉద్యోగులతో గ్రామాల్లో, పట్టణాల్లో అర్ధరాత్రి పూట తాళాలు పగలగొట్టించి భయభ్రాంతులకు గురి చేసే పద్ధతి సరైనది కాదని వెంటనే నిలిపివేయాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి జిల్లా అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి, పూల చంద్రశేఖర్, దర్శి నాగభూషణం, బండి భాస్కర్ రెడ్డి, వేమయ్య, నాగరాజు, అంకయ్య, అరవ పార్వతయ్య అడ్వకేట్, చిన్నయ్య, మూర్తి, శిబిరం వద్దకు అంగన్‌వాడి కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు తమ పూర్తి మద్దతు తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే వారి న్యాయపరమైన సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు గూడూరు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్. సురేష్, మున్సిపల్ సంఘం జిల్లా కార్యదర్శి బి. గోపినాథ్, జిల్లా కమిటీ సభ్యులు వి. చంగయ్య, పామంజి మణి, చంద్రయ్య, అంగన్‌వాడి జిల్లా అధ్యక్షురాలు పద్మలీల, రూరల్ అధ్యక్షురాలు ఏ. ఇంద్రావతి, స్వరూప రాణి, మంజుల, సుభాషిణి, విజయమ్మ, కుమారి, ఆసియా, మంగమ్మ, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో సుబ్రమణ్యషష్టి



ప్రత్యేక అలంకరణలో వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారు

సదుం, డిసెంబరు 18 ప్రభాతవార్త

మండల పరిదిలోని గార్గేయనది ఒడ్డున ఉన్న వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారి ఆలయంలో సోమవారం సుబ్రమణ్యషష్టిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధషష్టి రోజు సుబ్రమణ్యషష్టిని జురుకుంటాము. ఉదయం స్వామి వారి ఆలయంలో మూల విరాట్టులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాధాలు వినియోగించారు. వివిధ ప్రాంతాలనుంచి పలువురు భక్తులు వచ్చి పూజలు చేసుకున్నారు. అదేవిధంగా పూజలలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, డిసెంబర్ 18 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్ కూకట్‌పల్లెకు చెందిన రంగారావు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని డీడీ రూపంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఏనుగు దాడిలో గాయపడ్డ వ్యక్తికి ఆర్థికసాయం



కుప్పం, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మండలంలోని నూలుకుంట గ్రామంలో ఒంటరి ఏనుగు దాడిలో గాయ పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆవులప్పకు వైద్య ఖర్చుల నిమిత్తం జిల్లా అటవీ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి ఆదేశాలతో ముప్పైవేల ఆర్థికసాయాన్ని అందించారు. సోమ వారం పలమనేరు సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్, కుప్పం ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్వో వైసిరెడ్డిలు ఆవులప్ప కుమారుడికి నగదు అందించారు. వారు మాట్లాడుతూ ఏనుగుల సంచారం ఉన్నపుడు అటవీ అధికారుల సూచనలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏనుగుల సంచారం సమయంలో పొలాల వద్దకు వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో డిఆర్వో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## శ్రీవారి అనుగ్రహంతోనే ఏటా కాలినడక

### -పాదయాత్రతో తిరుమలకు చేరుకున్న ఆకేపాటి



తిరుమల,డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతోనే అన్నమయ్య నడచిన కాలిబాటలో ప్రతి ఏడాది నడచుకుని వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ అని ఉమ్మడి కడపజిల్లా జడ్పీఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం పార్వేటమండపం వద్దకు చేరుకున్న ఆకేపాటికి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కోడూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి స్వాగతం పలికారు.

## వికసిత భారత్ సంకల్పయాత్రలో ఉజ్వల గ్యాస్‌సిలిండర్ పంపిణీ



తిరుపతి,డిసెంబర్ 18ప్రభాతవార్త:

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఒక్కటైన మహిళలకు వరంగా ఉజ్వల గ్యాస్‌కనెక్షన్ అని రాష్ట్ర గవర్నర్ జస్టిస్‌అబ్దుల్ నజీర్ అన్నారు. ఈ పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు తిరుపతిలోని శ్రీనివాసా గ్యాస్ ఏజెన్సీ అధినేత పి.నాదముని ద్వారా ఐఓసి సేల్స్‌మేనేజర్ జగదీశ్ ఆధ్వర్యంలో గవర్నర్ జస్టిస్‌అబ్దుల్ నజీర్ పంపిణీ చేశారు. ఈ పథకం పేద,మధ్యతరగతి వర్గాల మహిళలకు ఒక వరంలాంటిదని అన్నారు.

## ఆరోగ్య శ్రీకి 25 లక్షలు కేటాయించడం సిఎం సాహసోపేత నిర్ణయం

### వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



సిఎం ప్రసంగాన్ని తిలకిస్తున్న రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త

ఆరోగ్య శ్రీకి సిఎం జగన్మోహన్ రెడ్డి 25 లక్షల రూపాయిలు కేటాయించడం సాహసోపేత నిర్ణయమని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని మున్సిపల్ కార్యాలయంలో సిఎం జగన్మోహన్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని మున్సిపల్ కార్యాలయంలో సిఎం జగన్మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయం నుండి ఆరోగ్యశ్రీకి 25 లక్షల రూపాయిలు కేటాయించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దేశంలోని ఇంత మొత్తం పేదల కోసం ఖర్చు చేయడం సిఎం జగన్మోహన్ రెడ్డి మంచి మనసుకు నిదర్శనం అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయం నుండి ఆరోగ్యశ్రీ 25 లక్షల రూపాయిలు కేటాయిస్తూ నిర్వహించిన ఓపెనింగ్ కార్యక్రమాన్ని టివి ద్వారా రామ్ కుమార్ రెడ్డి తలిలకించారు. ఆరోగ్య శ్రీకి 25 లక్షల రూపాయిలు కేటాయించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దేశంలోని ఇంత మొత్తం పేదల కోసం ఖర్చు చేయడం సిఎం జగన్మోహన్ రెడ్డి మంచి మనసుకు నిదర్శనం అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన రామ రాజ్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్య వైద్యానికి సిఎం పెద్దపీట వేసినట్లు తెలిపారు. 104, 108 అంబులెన్సులను సిఎం పెద్ద సంఖ్యలో పెంచినట్లు తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన దేశానికి ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ నక్క భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు నారాయణ, గోపాలకృష్ణమూర్తి, సుబ్బారావు, కళ్యాణి, శ్రీనివాసులు, నారిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కుప్పం, డిసెంబర్ 18 ప్రభాతవార్త

తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం గణేష్‌పురం సమీపంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై మోకాళ్లపై కూర్చుని ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనంగా 26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఆయాలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. తాము సమ్మె చేస్తుంటే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపించడం దారుణమన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరి చేదాకా సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సిఐ శ్రీధర్, ఇన్‌చార్జ్ ఎస్సై శివకుమార్ బందోబస్తు నిర్వహించారు.

## గవర్నర్ జస్టిస్ నజీర్‌కు సాదరస్వాగతం



తిరుపతి,డిసెంబర్ 18ప్రభాతవార్త:

రెండురోజుల తిరుపతి,తిరుమలపర్యటనకు సోమవారం ఉదయం తిరుపతికిచేరుకున్న రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్‌కు బిజెపి నాయకులు స్వాగతం పలికారు. బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథరెడ్డి,తూర్పుమండల ప్రధాన కార్యదర్శి తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పుష్పగుచ్చ అందజేసి స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో జయసూర్యకు పతకం



వడమాలపేట, డిసెంబరు 18 ప్రభాతవార్త:

వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జయసూర్య 48 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో కాంస్య పతకం సాధించినట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. డిసెంబరు 11 నుంచి 13వ తేదీ వరకు విజయనగరం రాజీవ్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొని ప్రతిభ కనబరచారు. జయసూర్యను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణ నవనీతం, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు.

## జిల్లా కలెక్టరేట్ ఎదుట న్యాయవాదుల నిరసన

### - యాక్ట్ 27ను రద్దు చేయాలంటూ డిమాండ్




చిత్తూరురూరల్, డిసెంబరు 18 ప్రభాతవార్త:

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 27ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిత్తూరు బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్‌ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల హరించడానికి రాష్ట్రప్రభుత్వం భూహక్కుల చట్టాన్ని తీసుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. న్యాయవ్యవస్థకు ఎటువంటి సంబందం లేకుండా ఓ విధానాన్ని రూపొందించి ప్రజలపై రుద్దాలని ప్రభుత్వం చూడడం చాలా దారుణమన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే పేద ప్రజలు, రైతులు, సొంత ఆస్తులు కలిగిన ప్రజలు, న్యాయవాద వృత్తికి, అలాగే న్యాయ వ్యవస్థకు తీవ్ర నష్టం, అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లోని న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి ప్రజలకు మద్దతుగా నిలబడటం జరిగిందన్నారు. ఈ చట్టం ప్రజల హక్కులను హరించే విధంగా వుండటం వలన వెంటనే ఈ రద్దు చేయాలని డిమాండ్‌చేసారు. ఈ నిరసన కార్యక్రమంలలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీ లీలా మనోహర్‌నాయుడు, న్యాయవాదులు షఫీఉల్లా, సుబ్రమణ్యం,చంద్రశేఖర్, ఎం. ఆనంద్, విశ్వనాథ్‌రెడ్డి,, మధు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గరికపాటికి సన్మానం



తిరుపతి,డిసెంబర్ 18ప్రభాతవార్త:

పవిత్రమైన ధనుర్మాసం సందర్భంగా సోమవారం సాయంత్రం అన్నమాచార్యకళామందిరంలో శివతత్వంపై ప్రవచనం జరిగింది. ప్రవచనకర్త గరికపాటిరమేష్‌బాబు ప్రవచనాలు శ్రోతలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గరికపాటిని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి,అక్కిపల్లి మునికృష్ణయాదవ్, వెంకట్రామయ్య దుశ్శాలువతో సన్మానించారు.

## శాస్త్రసోక్తంగా బాలాలయ దీపస్తంభ ప్రతిష్ట



చంద్రగిరి, డిశంబర్ 18 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి బాలాలయ ఆలయం వద్ద సోమవారం ఆలయ అర్చకులు సూరి స్వామి దీప స్థంభ ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉదయం 9 గంటల నుండి మధ్యా హ్నం 12.30 గంటల వరకు దీప స్థంభాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంఎల్ ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు, వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని దీప స్థంభానికి పూలమాలు నమస్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఆలయ ఈఓ సి.ఆర్.తిమ్మారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తా, ఎంపిటిసి రాజయ్య, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, బండారు హేమచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు కాంగ్రెస్‌పార్టీ మద్దతు



కార్వేటినగరం,డిసెంబరు 18 ప్రభాతవార్త:

కార్వేటినగరం కసవరాజభవన ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గత ఐదు రోజులుగా నిరవధికంగా నిర్వహిస్తున్న నిరసనకు మద్దతుగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు సోమవారం మద్దతు తెలిపారు. మోకాళ్ళపై వెళ్ళడం,సాష్టాంగనమస్కారాలు చేయడం,ర్యాలీ చేయడం లాంటి నిరసనలు తెలిపారు.కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ పూర్తి మద్దతు వుంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి,డిసిసి ప్రెసెడెంట్ పోటుగారి బాస్కర్,సేవాదల్ నాయకుడు గౌతమ్,మండలపార్టీ ప్రెసెడెంట్ దినకర్,బండ్ల నంబ్బరాయులు,తులసి మణి,తులసి రెడ్డి, కన్నన్, రాజేశ్వరమ్మ,గౌస్‌బాషా,పుష్పరాజ్,ఉమేష్,తారాసింగ్,తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో సెమీ క్రిస్మస్ ర్యాలి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సారధ్యంలో సోమవారం సెమి క్రిస్మస్ ర్యాలిని వైభవంగా నిర్వహించారు. వివిధ వేష ధారణలతో ప్రజల్ని ఆకట్టుకునే రీతిలో ర్యాలిని ఏర్పాటు చేసారు. ఆర్టిసి బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ నుంచి వీఎంసి సర్కిల్, వరదయ్యపాళెం రోడ్డు, జయరామారావువీధి, బజారు వీధి, తేరువీధి, నెహ్రూవీధి, సినిమావీధి, పాత నెల్లూరబస్టాండు మీదుగా ర్యాలి సాగింది. అలాగే పానగల్‌లోని అర్చి వరకు ర్యాలిని నిర్వహిం చారు. కార్యక్రమాల్లో గౌరవాధ్యక్షులు పాస్టర్ జీవమణి, అధ్యక్షులు పాస్టర్ అంబ్రోస్,కార్యదర్శి పాస్టర్ రవిడద్యాని ఉపాధ్యక్షులు పాస్టర్ మణిబాబు, కోశాధికారి పాస్టర్ జోసఫ్,సహాయ కార్యదర్శి పాస్టర్ ఏలిషా,పాస్టర్ రహేల్,పాస్టర్ విజయ్‌కుమార్, పాస్టర్ లూకా,పాస్టర్ సేమ్ పాల్,యోహాను,మోజస్, కొండయ్య, నతాయేల్, పాస్టర్ లాజరస్,ఇమ్మానియల్,డేనియల్ బ్రదర్‌ప్రసాద్, బ్రదర్ తిమోతి, ప్రేమ్‌సుందరం,సాల్మన్,రాజేంద్ర సాధర్యంలో ర్యాలి జరిగింది.

## అగస్త్యేశ్వర స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం

చంద్రగిరి, డిశంబర్ 18 ప్రభాతవార్త:



స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారికి సోమవారం ఆలయ అర్చకులు సహస్రఘటాభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున అగస్త్య మహాముని, అగస్త్యేశ్వర స్వామి, ఆనందవల్లీ అమ్మవారి అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ గావించారు. తదుపరి స్వామి వారికి సహస్ర ఘటాభిషేక నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ ధర్మకర్త భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి చేశారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు కొత్త శానంబట్లకు చెందిన తూకివాకం శాంతమ్మ ప్రభాకర్ రెడ్డి, తూకివాకం ఈశ్వరి చంద్రారెడ్డి దంపతులు అన్నదానం చేశారు. ఉదయం, సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆలయ ఆవరణలో దీపారాధనలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో శశి, శైలజ, అరుణ, రామచంద్రారెడ్డి, యుగంధర్ రెడ్డి, మానస, అనూష, పులికంటి తేజోవతి, రిటైర్డ్ టీచర్ అక్కులప్ప, తదితరులు పాల్గొన్నారు.

## టైక్వాండో టోర్నమెంట్స్‌లో కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు ప్రతిభ

తిరుపతి క్రీడా, డిసెంబర్ 18, ప్రభాతవార్త



తిరుపతిలోని అంబేద్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ,తుమ్మలగుంటలో జరిగిన టైక్వాండో టోర్నమెంట్స్‌లో తిరుపతి కేశవరెడ్డి పాఠశాల జయనగర్ బ్రాంచ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. వారు 16,18,20,25 కిలోల విభాగాలలో బంగారు పతకాలు 4, వెండి పతకాలు 4, కాంస్య పతకాలు 9 సాధించారు. ఈ విధంగా తమ ప్రతిభను చూపి ఆల్ రౌండ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుపొందారు. మానసిక ఆనందానికి చదువు సంధ్యలు ఎంత ముఖ్యమో, శారీక సామర్థ్యానికి, స్వీయ సంరక్షణకు ఈ టైక్వాండో పోటీలు ఎంతో ఉపయోగపడతాయని వీరు నిరూపించారు.

## వైకుంఠ ఏకాదశి దర్శనాల ఏర్పాట్లు పరిశీలించిన చైర్మెన్

శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు సుదర్శనం,ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లును సోమవారం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పర్యవేక్షించారు.ఇక్కడి పురాతన ఆలయం పునర్నిర్మాణంలో ఉంది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని నాలుగు వైపుల నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు హాజరౌతారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సదుపాయం కల్పించాలని సూచించారు. చైర్మెన్‌తో పాటు ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఏఇఇ కిషోర్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రతాప్, సూర్యప్రసాద్, చిన్నఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఆలయార్చకులు శ్రీనివాసశర్మ,ప్రముఖులుభాస్కర్‌ముదిరాజ్,శంకరయ్యలు పాల్గొన్నారు.

## మా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి

### -సిఎంగారు.. స్పందించండి-తల్లిదండ్రుల వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిడ్డతో తల్లి రమాదేవి

తొట్టంబేడు, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మా బిడ్డకు ప్రాణ బిక్ష పెట్టండి సిఎం గారూ.. అంటూ ఓనిరుపేద కుటుంబం సిఎంను వేడుకుంటోంది. ఆడుతూ పాడుతూ ఉండాల్సిన ఆ చిన్నారి ప్రస్తుతం ఆస్పత్రిలో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. అయితే చిన్నారి చికిత్సకు సుమారు రూ.13లక్షలు ఖర్చవుతుంది. అయితే కూలి పనిచేసుకుని జీవనం సాగించే ఈ దంపతులు తమ చిన్నారిని ఎలాగైనా బతికించుకోవాలన్న ఆశతో ఆస్పత్రిలోనే ఉంటూన్నారు. మండలంలోని కాసరం హరిజవాడకు చెందిన వి.ప్రభాకర్, వి.రమాదేవిలకు ఇద్దరు పిల్లలు చిన్నారి దీక్షిత(5), బాలుడు వి.భాను ప్రకాష్(3)లు ఉన్నారు. భాను ప్రకాష్‌కు గత కొద్దిరోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ చిన్నారులు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మూడు రోజులు ఇక్కడ చికిత్స తీసుకున్న అనంతరం వైద్యులు తెల్లరక్తకణాలు తగ్గిపోయాయని వెంటనే తిరుపతికి తీసుకెళ్ళాలని సూచించడంతో వారు తిరుపతిలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకోసం చేర్పించారు. అయితే ఇక్కడ కూడా చికిత్స తీసుకున్న తర్వాత చిన్నారి పరిస్థితి ఆరోగ్యంగా లేకపోవడంతో ఇక్కడి వైద్యులు కూడా చెన్నై, లేదా వేలూరులోని సిఎంసి ఆస్పత్రికి తీసుకెళ్ళాలని చెప్పగా చెన్నైలో వర్షాలు పడుతుండడంతో తల్లిదండ్రులు వేలూరులోని సిఎంసి ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఇక్కడి వైద్యులు బాలుడిని పరీక్షించి బాలుడికి రక్త ప్రసరణ లేకపోవడం సిఎంసి వైద్యులు గుర్తించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కూలిపనిచేసుకుని జీవనం గడిపే తాము లక్షలు ఎలా తీసుకురాగలమని తమ చిన్నారిని బతికించుకోవాలంటే సిఎం సాయం చేయాలని, దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం చిన్నారి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుండడంతో చిన్నారి ఎముకలగుజ్జును పరీక్షల నిమిత్తం ఢిల్లీకి పంపించినట్లు తెలిపారు. ఫలితాలువస్తే చిన్నారికి ఏలాంటి జబ్బు ఉందో తెలుస్తుందని వైద్యులు తెలియజేశారు. దాతలు తమ చిన్నారి భాను ప్రకాష్‌ను ఆదుకోవాలని 9550093821 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు. కాగా సాయం చేసే వారు ఫోన్‌పే కానీ, గూగుల్‌పేలో కానీ నగదు పంపించవచ్చన్నారు. లేదా యూనియన్‌బ్యాంకుఖాతానంబర్ 520441023239992 (ఐఎఫ్‌సి కోడ్. యుబిఐయన్0929476) వి.ప్రభాకర్ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాకు దాతలు స్పందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.